కథానిక

# ఉన్నది ఉన్నతి

–శ్రీవిరించి






* సృష్టి రహస్యాలు తెలుసుకునే ప్రయత్నంలో మనిషి అతి చురుకుగా తెలుసుకుంటున్నాడు. దీన్నంతటినీ మానవ జీవితం మరింత సుఖకరం, సుగమం కావడం కోసం ఉపయోగిస్తున్నాడు.

భోజనాలు అయ్యేసరికి రెండు గంటలు అయింది.

'ఓ అరగంటసేపు నడుం వాల్చండి. తరువాత యేం చేసేదీ ఆలోచించవచ్చు–' అని అరుంధతి, కమలాకరం మరీ మరీ చెపిన మీదట అలాగే వుండిపోయారు – సుబ్బలక్ష్మి, శివశంకరమూ. వాళ్ళు మొదట చేసిన ఆలోచన ప్రకారం అయితే ఈ సరికల్లా ఇంటికి వెళ్ళిపోవాలి.

జీవితంలో ఎప్పుడూ ఉరుకులు, పరుగులు కమలాకరానికి. ఎటొచ్చీ రిటైరయి పోయిన ఈ రెండున్నర నెలల నుంచి కాస్తంత విదానంగా ఏమీ హడావుడి లేకుండా పనులు చేసుకోవడం అలవాటు చేసుకుంటున్నాడు. 'కంపెనీ సెక్రటరీ' ఉద్యోగం అంటే ఆషామాషీ అయినదని ఆయన ఒక్కనాడూ అనుకోలేదు. ఇతరులను అనుకోనివ్వలేదు.

అరుంధతి మటుకు ఎప్పుడూ ఒకటే తీరు – కష్టం వచ్చిందని కుంగిపోదు, సుఖం వచ్చిందని పొంగిపోదు. అలా వుండడం ఒక రకమైన 'జడత్వమే'నని కమలాకరం ఎన్ని మార్లో పోట్లాడి చెప్పినా ఆమెలో మార్పు రాలేదు. నాలో మారవలసిన లక్షణాలు ఏమీ లేవు– అన్న సంగతి ఆమెకు అవలీలగా తెలుసు.

సుబ్బలక్ష్మి, శివశంకరమూ వాళ్ళకు కొత్తవాళ్ళే.

కమలాకరం రిటైర్ అయిన ఉద్యోగంలో శివశంకరం వచ్చి చేరుకున్నాడు. మరో కంపెనీలో 'న్యూఢిల్లీ'లో వుండేవాడు యింతకు ముందు. ఈ కంపెనీ డైరెక్టర్లలో ఎవరికో అతను బంధువనీ, అందుకనే యిక్కడ ఇంత సునాయాసంగా ఎక్కువ 'పెర్క్స్' తో ఉద్యోగం సంపాదించగలిగాడనీ కమలాకరం విన్నాడు. అయినా అతను యిదంతా పట్టించుకుని పదే పదే ఆలోచనల్లోనికి తెచ్చుకోలేదు. పోయేవాడిని నాకెందుకు రవ్వ? – అనుకున్నట్లు, అనుకోనట్లూ శివశంకరం 'అండర్ స్టడీ'గా వున్న మూడు నెలలూ అరమరికలు లేకుండా తనకు తెలిసినదంతా – కంపెనీ వ్యవహారాలు – అతనికి చెప్పాడు. తనకు ఎలాగూ ఎక్స్‌టెన్షన్ యివ్వరని తేలిపోయింది గదా!

–నేను రిటైర్ అయిపోయినా విషయ పరిజ్ఞానాన్ని 'తాజా'గా వుంచుకుందామనే అనుకుంటున్నాను. అకస్మాత్తుగా అన్నీ మర్చిపోలేం గదా– అన్నాడు శివశంకరంతో.

ఆంధ్రజ్యోతి
సచిత్ర వారపత్రిక
1997 దీపావళి
ప్రత్యేక సంచిక

అతను యేమీ బదులు చెప్పకుండా చిరునవ్వు ధరించి ఊరుకున్నాడు. అది మెచ్చుకోలో - విరసమో ఒకంతట తేల్చుకోలేకపోయాడు కమలాకరం. ఈ మాటే అరుంధతితో అంటే 'అతని అభిప్రాయం ఏదయితే మీకేం? మీ మనసుకు నచ్చినట్లుగా మీరు తీసుకోండి. అందులో అతని ప్రమేయం యేముంది గనుక! అన్నదామె.

శివశంకరం కొన్ని కొన్ని మౌలిక విషయాలలో తనను సలహా అడుగుతూ వుండాలని, అలా సంప్రదించుతూ వుండడమే కంపెనీకి 'లాభదాయకం' అనీ కమలాకరం మనసారా నమ్ముతున్నాడు. ఈ విషయాన్ని సూచన మాత్రంగానయినా అతనికి చెప్పగల అవకాశం యివ్వడం లేదు శివశంకరం.

అనవసర విషయాలలో కలుగజేసుకుని వున్న కొద్దిపాటి స్నేహాన్ని పాడు చేసుకోకండి - అని సలహా యిచ్చింది అరుంధతి.

స్నేహాన్ని విలువుకునే ప్రయత్నంలోనే - యిదుగో ఈ రోజున ఇద్దరినీ భోజనానికి పిలిచాడు. నెల రోజుల నుంచీ ప్రయత్నిస్తూ వుంటే ఈ రోజుకు దొరికింది - ఆ కొత్త దంపతులకు తీరుబడి!

'అయినా ఎందుకు అనవసరంగా శ్రమ పడతారు? పిన్నగారికి హైరానా అయిపోతుంది - మేం రావడంతో-' అని సుబ్బలక్ష్మి తప్పించుకోవడానికి చూచింది.

'అదేం కుదరదు అమ్మాయి. అంతగా అయితే నువ్వు వచ్చి వంటచేసి పెదుదువుగాని' అంది అరుంధతి.

తనకంటే కనీసం యిరవయి యేళ్ళయినా చిన్నదయి వుంటుంది సుబ్బలక్ష్మి - అని ముందే అంచనా వేసుకుంది అరుంధతి. అందుకనే మొదటి రోజు నుంచి ఏకవచన ప్రయోగమే చేసి 'అతి చనువు'గా మాట్లాడడం ప్రారంభించింది. సుబ్బలక్ష్మి యేమీ అభ్యంతరం చెప్పలేదు. ఇష్టం లేనట్టుగా ముఖం చిట్లించలేదు.

వాళ్ళిద్దరూ అతిథుల గదిలో విశ్రాంతి తీసుకుంటూ వున్నప్పుడు అరుంధతీ, కమలాకరం తమ గదిలో అంతవరకు జరిగినదాన్ని - అతిథి సత్కారాలను గురించి - ముచ్చటించుకున్నారు.

వంటకాలన్నీ చక్కగా కుదిరాయనుకుంటున్నాను. ఏమీ వంకలు పెట్టకుండా తినేశారు గదా వాళ్ళు' అంది అరుధతి. కొత్తవాళ్ళు ఆక్షేపణలు చేయరనే సంగతి ఆమెకు తెలియనిది కాదు.

'నీ వంటకు వంకలు పెట్టేవాడు - పేపర్లో ఎడ్వర్‌టైజ్ చేసి వాక్ - యిన్ - ఇంటర్వ్యూలు జరిపినా ఎవరూ దొరకడు!' అన్నాడు కమలాకరం. అతని మాటల్లో మెచ్చుకోలు లేదు. అతి సహజమైన అతని అభిప్రాయం అది. అయినా అరుంధతికి ఆ మాటలు సందర్భం వచ్చినప్పడల్లా ఒక్కమారయినా వినకపోతే యేమిటో చిన్నబోయినట్లుగా వుంటుంది.

'సుబ్బలక్ష్మి యేమీ భేషజం లేని పిల్ల. ఈ రోజుల్లో యిలాంటి వాళ్ళు వుండడం అరుదు' కమలాకరం యేమీ అనలేదు. ఏమనటానికీ ఆమెను గురించి అతనికి ఏమీ తెలియదు. పైగా అతని మనసంతా శివశంకరాన్ని కేంద్రం చేసుకునే వుంది. అరుంధతి యీ అయిదారు గంటలలోనే ఆ అమ్మాయిని కాచివడబోసి వుంటుంది గనుక ఆమె 'ఎసెస్‌మెంట్'లో ఎలాంటి అవకతవకలు వుండడానికి వీల్లేదని మాత్రం దృఢవిశ్వాసం.

## మదర్‌థెరిసా నిర్భీతి!

ఒకసారి కరుణామయి మదర్‌థెరిసా కలకత్తాలో కొందరు కుష్ఠు రోగులకు సేవ చేస్తూ వుండగా ఒక పొగరుబోతుదైన దున్నపోతు అమితవేగంగా ఆమె వైపు దూసుకురాసాగింది. ఆ దృశ్యం చూసి అక్కడున్న వారు రోగులు భయభ్రాంతులయ్యారు! అయితే థెరిసా తాను ఉన్న చోటు నుంచి కదలకుండా, ధైర్యంగా అలాగే నిలబడిపోయింది-ఆ జంతువును చూస్తూ తన వంక ప్రశాంతవదనంతో, నిర్భీతితో చూస్తున్న ఆమెను చూసి దున్నపోతు హఠాత్తుగా ఆమె ముందు ఆగిపోయింది. కొద్దిసేపు థెరిసాను చూస్తూ నిలబడిన తర్వాత అది వెనక్కు తిరిగి వెళ్లిపోయింది!

-కొడిమెల

'వాళ్ళను రాత్రికి కూడా యిక్కడే వుండి పొమ్మందామా? అన్నాడు కమలాకరం.

'బాగుంటుందా? అతి చనువు తీసుకున్నట్టు వుండదూ? - అయినా అంత ఆప్యాయత ఎందుకు ఉబికి వస్తోందట?'

'శివశంకరానికి నన్ను గురించి గొప్ప అభిప్రాయం ఏర్పడడం చాలా అవసరం అరుంధతీ!'

ఆ అవసరం యేమిటో అరుంధతికి అర్థం కాదు. అయినా ఈ విషయం ఆమె తర్కించదలుచుకోలేదు.

వాళ్ళు - సుబ్బలక్ష్మి, శివశంకరం - నిద్రలేచి యివతలకు వచ్చేసరికి నాలుగున్నర అయింది.

పిన్నిగారు వద్దన్న కొద్దీ వడ్డించారు. భుక్తాయాసంతో ఒళ్ళు మరచిపోయాను. మీ పనులన్నీ చెడగొడుతున్నానోయేమో.. అన్నాడు కాస్త బిడియాన్ని, అభిమానం జోడించి శివశంకరం.

నాకు పిన్ని గారయితే మీకు ఎలా పిన్నిగారయినారో అంది సుబ్బలక్ష్మి.

నాకు ఆమె అత్తగారయితే యిలా మనసు విప్పి మాట్లాడలేను గనుక' అన్నాడు శివశంకరం మాటలకు తడుముకోకుండా

సుబ్బలక్ష్మి భోళాగా నవ్వేసింది.

అరుంధతి 'ట్రే'తో టీ, బిస్కట్లు తెచ్చి వీళ్ళ ముందు వుంచింది. నలుగురూ టీ కప్పులు చేతుల్లోనికి తీసుకున్నారు.

ఇంతకూ కమలాకరం బాబాయిగారు అదృష్టవంతులు అన్నాడు శివశంకరం.

'నేను జీవితంలో ఎన్ని కష్టాలు పడ్డానో, ఎంత నష్టపోయానో తెలిస్తే మీరు యిలా అనరు! అన్నాడు కమలాకరం అరుంధతి వంక తేరిపార చూస్తూనే.

కష్టాలు, నష్టాలు బేరీజు వేసుకోవలసిన సమయమా యిది?' అంది అరుంధతి. సంభాషణ అలా మళ్ళటం యిష్టం లేక... అతని గరళకంఠాన్ని ఆపుతూ.

'అయాం సారీ. నాకు యేమీ తెలియకపోయినా అంతా తెలిసినట్లు మాట్లాడుతున్నాను. క్షమించండి' అన్నాడు శివశంకరం.

'హాయిగా ఉద్యోగం నుంచి రిటైర్ అయినారు. పిల్లలు ఎవరి పనులు వాళ్ళు చేసుకుంటూ మీ మీద యింకేమి బాధ్యతలు మిగల్చకుండా మిమ్మల్ని అవసరం అయితే కంటికి రెప్పల్లా కాపాడుతూ చూసుకోవడానికి సిద్ధంగా వున్నారు. దీన్నే అదృష్టం అంటారు ఆయన. మరేం అనుకోకండి. ఇలాంటి 'హాపీ ఫామిలీస్' దేశంలో ఎన్ని వున్నాయి - ఇదీ ఆయన సంతోషం అని విడమరచి చెప్పింది సుబ్బలక్ష్మి.

'సుఖంగా ఉన్నామా లేదా అన్నది ఎవరి మనసుకు వాళ్ళకు తెలియాలి! సుఖం - ఆనందం - సంతోషం... యిలాంటి వన్నీ మనసుకు విషయాలు నన్నడిగితే. శరీరంతో సంబంధం పెట్టుకుని జనం వాటిని గురించి దురూహలు పెంచుకుంటారు' అంది అరుంధతి.

నీ వేదాంతం మొదలయిందీ? ఇదేనా అదృష్టం శివశంకరం ఆయన గొంతులో కొంత వేళాకోళం మిళితమై వుంది.

తప్పకుండా బాబాయిగారు. ఇంతకంటే యింకేం కావాలి?

ప్రతిదాన్నీ ఫిలాసఫైజ్ చేయడంలో ఆయన ఎక్స్‌పర్ట్ బాబాయిగారు. ఈసరికి మీకు తెలిసే వుండాలి అంది సుబ్బలక్ష్మి.

కమలాకరం యింకేమనటానికీ తోచక మిన్నకుండి పోయాడు.




ఉదయం నుంచి హాయిగా కాలక్షేపం చేశాం. మీరు మీ యింటికి వెళ్ళిపోతామంటే మాకు ఒక నెల రోజులదాకా ఇ[illegible]బోసి పోయినట్లు అయిపోతుంది. ఈ ఇంట్లో మరో జంట ఆనందంగా నడయాడి, కులాసాగా కబుర్లు చెప్పి నవ్వి మమ్మల్ని నవ్వించి కడుపునిండా భోజనం చేసి హాయిగా నిద్రపోయి ఎన్నాళ్ళు అయిందో. ఇది తలుచుకునేవారు మనసు కష్ట పెట్టుకుంటారు. అంతకంటే మరేం లేదు' అంది [illegible]

'ఇంకో గంట సేపు కూర్చుంటాంలెండి" అన్నాడు శివశంకరం.

"మీరు ఆరుగంటలకు ఉపన్యాసానికి వెళ్ళాలని గుర్తుందా?" అంది సుబ్బలక్ష్మి.

"యే, నువ్వు రావా యేమిటి?"

"నేనూ పిన్నిగారూ కబుర్లు చెప్పకుంటూ ఇక్కడే వుండిపోతాం. మీరూ, బాబాయిగారూ మీటింగ్‌కు వెళ్ళిరండి. మీరు వచ్చాక, ఏడున్నరకు మనం ఉడాయించేద్దాం–" అని అరుంధతి వంక తిరిగి "మీరు మాత్రం రాత్రికి మా కోసం యింకేమీ వంటకాలు చేయనంటేనే సుమండీ! పిన్నిగారూ, మేం రాత్రిళ్ళు భోజనం మానేసి చాలాకాలం అయింది" అంది సుబ్బలక్ష్మి.

మీటింగులకు వెళ్ళడం కమలాకరానికి రుచికరం కాదు. ఆయనెప్పుడూ డైరెక్టర్ల మీటింగులు, ఆఫీసుల్లో సహోద్యోగుల మీటింగులు ఎరుగునుగాని వేరే పబ్లిక్ మీటింగుల ప్రసక్తి పెట్టుకోడు. ఉపన్యాసాలు వినడం అట్టే అభిరుచి దాయకమైన విషయం కాదు. అయినా తనకు ఇష్టం లేనట్లుగా కనిపించడం యిష్టంలేక 'ఎక్కడ మీటింగ్? ఏమిటి విషయం?" అన్నాడు.

"దివ్యజ్ఞాన సమాజంలో ఎవరో ఒకాయన మాట్లాడుతున్నాడు. మీరు తప్పకుండా రావాలని మన అడ్వకేట్ నరసింహంగారు నిన్ననే టెలిఫోన్‌చేసి మరీ చెప్పారు" అన్నాడు శివశంకరం.

"దివ్యజ్ఞాన సమాజంలోనా? అంటే కర్మ–పునర్జన్మ–మరణానంతర జీవితం గురించి వినడానికి సిద్ధపడి వుండాలి!" అన్నాడు కమలాకరం,

# ధ్యానంలో...

ధ్యాన ంలో వున్నాను, ధ్యాన ంలో
మెరుపుకీ మెరుపుకీ మధ్య చీకట్లో
చీకట్లో
నిశ్శబ్దంలో
ఏకాంతంలో

★★★

వెలుగును ఇష్టపడతున్నాను,వెలుగుని-
వృక్షాల్లోనూ
కొండల్లోనూ
సముద్రంలోనూ
లేస్తూ లేస్తూ లేత సూర్యుడంటే ఎంతో ఇష్టం.

ఆకుల పైన, ఇసుక మీద , నదిలో నీళ్ళ మీదా మెరిసే
వెన్నెల వెండి అలలంటే
ఎంతైనా యిష్టం.
చీకటిని ఆరాధిస్తాను నేను చీకటిని
వెలుగు కు బాటై మెరిసే చీకటిని
కంటికి వెలుగునిచ్చే చీకట్ని ప్రేమిస్తాను!

శబ్దాన్ని ఇష్టపడతాన్నేను , శబ్దాన్ని
ప్రకృతి చేసే ప్రతిధ్వనికే ప్రతిధ్వనిస్తాను
కోయిల నాదం , మయూరికేక , జలపాత నిశ్శబ్దంలో
శబ్ద నాట్యాల్ని విన్నాన్నేను
మనిషి గొంతులో సహస్రాది రాగ మూర్ఛనల ఇంద్ర ధనుస్సులకు
ఆకాశమే అంచని గమనించాను.
ప్రతి ప్రకృతి శ్రావ్య శబ్దానికి షడ్జమ శ్రుతిగా
నిలిచే నిశ్శబ్దాన్ని ప్రేమిస్తాను
శిశువులూ , శిశువుల్లాంటి సంగీతజ్ఞులూ , శాస్త్రజ్ఞుల్ని ఇష్టపడతాను
చెట్లూ, పువ్వులూ , పక్షులూ, నక్షత్రాలూ , ఆకాశం
నెమళ్ళూ , లేళ్ళూ
జన్మని ధ్వనించేసే అద్భుత దృశ్యాలూ-
శ్రుతి కలిపే ఒక శ్రావ్య శబ్ద శోధనలనో
ఎన్ని యుద్ధ శబ్దాల్ని భరించగలను?
కలలు కలిసీ ఒక్క కంటి వెలుగు కోసం
ఎన్ని వేల కళ్లలో అంధకారాన్ని అధిగమించగలను?
ఏకాంతాన్ని ఆరాధిస్తాన్నేను , ఏకాంతాన్ని !
నా మస్తిష్కం నిండా
అనేక వెల్తుర్లు , అనేక శబ్దాలు, అనేక ప్రపంచాలు,
శతాబ్దాల తరబడి , పర్వతాల ఎత్తున
పుట్టల పుట్టల పాండిత్యం , ఎంతెంత జ్ఞానం
ఎన్నెన్ని జ్ఞాపకాలు-

★★★

నా మస్తిష్కంలో ఖాళీ కావాలి , శూన్యం కావాలి నాకు,!
ఇప్పుడది
నా ఎవరెస్టు శిఖారోహణ మంతటి గమ్యం
సరికొత్త మెరుపుకి చోటిచ్చే చీకటి కోసం
సరికొత్త శ్రావ్య శబ్దానికి శృతి పెట్టే నిశ్శబ్దం కోసం
సరికొత్త ఆలోచనల్ని సృష్టించేందుకు నా మస్తిష్కంలో శూన్యం కోసం
ధ్యానంలో
వున్నాన్నేను
ధ్యాన ంలో

● అక్కినేని బలరాం




అరుంధతి వంక కొంటెగా చూస్తున్నట్టు నటిస్తూ.

'థియోసఫిస్టులు ఇప్పుడు మరణానంతర్వ జీవితాన్ని గురించే ఎక్కువగా మాట్లాడుతున్నారు-"

"థియోసఫిస్టులు చెప్పినట్లు మనవాళ్ళు ఓల్డ్ కస్టమ్స్ అన్నీ బాగా ఆలోచించే పెట్టారోయ్-" అన్నాడు కన్యాశుల్కంలో గిరీశంగారు, గుర్తుందా మీకు?" అనడిగింది అరుంధతి.

"అవును. పొటీగరావు పంతులుగారి నౌకరు దగ్గర యజ్ఞోపవీతం చేతవుచ్చుకు ప్రమాణం చేశాడు కదూ?" అని టక్కున సమాధానం చెప్పాడు కమలాకరం.

సుబ్బలక్ష్మి ఇద్దరివంక మరింత ఆప్యాయంగా చూచింది.

'ఆ పొటిగరావు పంతులు-అంటే "ఫోటోగ్రాఫర్" అని అర్థం కావటానికి నాలుగు సంవత్సరాలు పట్టింది నాకు. తెలుసా? చిన్నప్పుడు" అన్నాడు శివశంకరం.

"ఇంగ్లీషు మాటల్ని తెలుగుచేసి మాండలికంలో వాడుకునే తీరును అప్పారావుగారు చాకచక్యంగా ప్రదర్శించారు. ఆ నాటకం నిండా" అన్నాడు కమలాకరం.

"విద్వాన్ అంటే కోర్టులని లాటిన్ భాషలో నిజంగా వుందో లేదో ఎవరినయినా కనుక్కోవాలి-ఈ విషయం ఎవరేనా రాశారా యిదివరకే" అని అడిగింది అరుంధతి. అందరూ నవ్వుకున్నారు.

"ఇంతకూ అప్పారావుగారు 'థియోసఫిస్టా?' "

"ఆయన అవునో కాదో నాకు తెలియదుగాని ఆయన్ను పోషించిన విజయనగరం మహారా

జావారు మాత్రం ఆ సంస్థకు, వ్యవస్థాపకులకు మహారాజ పోషకులుగా వుండేవారు. అంతెందుకు, అప్పారావుగారి స్నేహితుడు, ప్రిన్సిపాల్ పి.టి. శ్రీనివాస అయ్యంగార్ "థియోసఫిస్ట్ అయితేనేంగాని, బహు మంచివాడు' అని మారేమండ కవిగారు విశాఖపట్టణంలో చెబుతూ వుండేవారని ఆరుద్రగారు యిటీవల ఒక వ్యాసంలో వ్రాశారు, చూశావా?"

– కమలాకరం విషయ పరిజ్ఞానానికి శివశంకరం నిజంగా అబ్బురపడిపోయినాడు.

టైం అయిదున్నర దాటింది గనుక మగవాళ్ళిద్దరూ హడావుడి పడుతున్నారు. "ఆ మీటింగ్ హాల్ ఇక్కడికి రెండు వీధుల అవతలే వుంది. మరేం కంగారు పడకండి– అయిదు నిమిషాలలో వెళ్ళగలరు" అని భరోసా ఇచ్చింది అరుంధతి.

మీటింగ్ హాల్ చిన్నది. యాభయి అరవయి మంది కంటె ఎక్కువ పట్టరు. వాళ్ళిద్దరూ వెళ్ళేసరికి 'సర్వమత ప్రార్థనలు' జరుగుతున్నాయి. గుమ్మంలోనే ఆపేశాడు వాలంటీరు. ప్రార్థనలు ముగిశాక వాళ్ళిద్దరికీ దాదాపు చివరి వరుసల్లో వున్న కాళీ కుర్చీలు చూపించి లోపలకు పంపాడు.

అధ్యక్షుడు యేదో మాట్లాడుతున్నాడు, బహుశ 'స్పీకర్'ను పరిచయం చేయడం కాబోలు అనుకున్నాడు కమలాకరం.

ఉపన్యాసకుడు వయోధికుడు కాదు. నలభయి, నలభయి అయిదు కంటె ఎక్కువ వుండదు వయసు. జుట్టు నెరవడం యింక ప్రారంభం కాలేదు.

హాలు గోడల చుట్టూ వున్న పుస్తకాల బీరువాలవంక ఆసక్తిగా చూస్తున్నాడు కమలాకరం. దాదాపు నేలమీద మంచి పైకప్పు దాకా వున్నాయి. ఎన్ని పుస్తకాలు! ఎన్ని విషయాలు!

సోక్రటీస్ చెప్పినట్లుగా మనిషికి అక్కర్లేని వస్తువులు అనేకం వున్నాయి. ఈ ప్రపంచంలో

ఈ సృష్టిలో గిరీశంగారు అన్నట్లు యిదంతా రద్దు సృష్టేనా? పుస్తకాలు కూడా ఇందులోనే చేరుతాయా? ఒక్కనాటికీ చేరవు. విషయ పరి

దసరా, దీపావళి శుభాకాంక్షలతో...

గృహిణులకు శుభవార్త

మీ వంటింటికి, బాత్‌రూమ్‌లకు కావలసిన అన్ని రకముల కుళాయిలకు, ఫ్యాన్సీ, మోడరన్ రకాలకు సంప్రదించండి:

సాంబమూర్తి ఎంటర్‌ప్రైజెస్
(పైప్ ఫిట్టింగ్ షాప్)
12-10-4, కాన్వెంటు వీధి, విజయవాడ.
ఫోన్స్: 563824, 561996
రెసి.: 430287

అధీకృత విక్రేతలు :
LEADER VALVES & COCKS
ARK CP FITTINGS
UNIK GI FITTINGS
M.SEAL & ASHOK SHELLEC & WATER METERS ETC.

జ్ఞానం పెంపొందించుకుందుకు చూచేవాడిని. కాకపోతే ఇన్ని పుస్తకాలు చదవటానికి, చూడటానికి, ఎంతో సమయ విరామం ఓపిక–చురుకయిన బుర్ర వుండాలి. ఈ మూడింట్లో ఏది కొరవడినా తన మాదిరే అయిపోతుంది జీవిత గమనం...అనుకున్నాడు కమలాకరం.

ఉపన్యాసం మొదలు అవడంతో అతను చుట్టూరా చూడడం మానేసి వినడం మొదలు పెట్టాడు.

"సృష్టిలో 'మనిషి' వున్నట్లే ఇతర జీవరాశులూ వున్నాయి. చెట్లు–చేమలు, కొండలు– నదులు, నక్షత్రాలు–గ్రహగోళాలు ఎన్నో వున్నాయి. ఇవన్నీ మనిషి తన కోసరమే, తన స్వప్రయోజనం కొరకే వున్నాయని భ్రమించి ఎన్నో వైరుధ్యాలు, వైషమ్యాలు, యుద్ధాలు తెచ్చిపెట్టుకుంటున్నాడు. సృష్టిలో యే వస్తువూ ఇతరుల కోసం కాదు. దానంతట అది వుంది. అంతే! అంతా పరస్పరం ఆశ్రయంగా, అంతర్ బద్ధంగా వుంది ఈ విశ్వం.

– ఇలా సాగిపోతోంది ఉపన్యాసం.

శివశంకరం శ్రద్ధగా వింటున్నాడు.

కమలాకరం కూడా చెవులు వప్పజెప్పి వింటున్నాడుగాని, మనసు లోమరోవిషయం మెదులుతూ వుంది.

భూమి సూర్యుడి చుట్టూ తిరుగుతూ వుందా?
సూర్యుడే భూమి చుట్టూ తిరుగుతున్నాడా?

– ఈ రెంటిలో యేది నిజం కాకపోవచ్చు, 'మనిషి' మాత్రం డబ్బు చుట్టూ తిరుగుతున్నమాట నిజం. నిజంగా నిజం.


మనుషులందరూ అలా డబ్బు కోసం...సుఖ పురుషుల్లా వెంపర్లాడుతున్నారా? పురుషులందు పుణ్యపురుషులు వేరుగా వున్నారా?

–సృష్టిలో రహస్యాలు తెలుసుకునే ప్రయత్నంలో మనిషి అతి చురుకుగా పనిచేస్తున్నాడు. అనేక కొత్త విషయాలు తెలుసుకుంటున్నాడు. దీనంతటినీ మానవ జీవితం మరింత సుఖమయం, సుగమం కావడం కోసం ఉపయోగిస్తున్నాడు. అలా కాకుండా తన స్వప్రయోజనం కోసమే ఉపయోగిస్తే భస్మాసురుడైపోతాడు. మనం ఎన్నెన్ని రంగాలలో ఎందరెందరు భస్మాసురులను తయారు చేస్తున్నామో చూచుకోవలసిన తరుణం ఆసన్నమయింది. ఈ ప్రపంచంను మన వారసులకు మనం ఇప్పుడు ఉన్న స్థితి కంటె మెరుగయిన పద్ధతిలో అప్పజెప్పవలసిన బాధ్యత మనకు వుంది. ప్రకృతిని అర్థం చేసుకుని దానితో సహకరించి పని చేయడం అవసరం.'

పిల్లలపట్ల తన బాధ్యత...బాగా చదువులు చెప్పించడం
మంచి ఉద్యోగాలు వేయించడంతో సరిపోయిందా? వాళ్ళను అనుక్షణమూ యాజమాయిషీ చేస్తూ బాగోగులు చెబుతూ వుండవలసిన అవసరం లేదా? తన అనుభవం అంతా వాళ్ళకు మరింత సుఖ పురుషులను చేయడానికి వినియోగించ వద్దూ?...ఈ బాధ్యత తనదీ అని తను అనుకోవడమేగాని వాళ్ళు...కొడుకులు–కూతుళ్ళు–కోడళ్ళు–అల్లుళ్ళు–మనుమలు–మనమరాళ్ళు...తనను యే విషయంలోను సంప్రదించరేం? తాను కలుగజేసుకుని యేమన్నా చెప్పినా విన్నట్లు మన్నించినట్లు అగుపించరేం? అందరూ తనకు ఎప్పటికప్పుడు 'ఫాలో అప్ రిపోర్ట్స్' పంపించరేం? నివేదికలు సమర్పించరేం?

'వాళ్ళ మంచిచెడ్డలు వాళ్ళకు తెలుసు. అడగందే సలహాలు చెబితే ఎక్కువ అయిపోతాం. అయినా మనకేం తెలుసునని? వయస్సు ఎక్కువ గనుక మనమేం సర్వజ్ఞులమా?' అనుకునే అరుంధతి మాటలు నిజమేనా? లేక–తప్పించుకు తిరిగే ధోరణా ఇది?

బాధ్యతా రాహిత్యం అనిపిస్తుంది–కమలాకరానికి కుటుంబీకుల బాగోగులు కనిపెట్టకపోతే భద్రతా రాహిత్యం అనిపిస్తుంది–వాళ్ళను గురించి రోజుకోసారయినా తలుచుకుని భరోసా పడకపోతే.




సభలో అందరూ చప్పట్లు చరిచారు. కమలాకరం ఉలిక్కిపడి ప్రస్తుతం లోనికి వచ్చాడు. ఎంత పొరపాటు జరిగింది! ఏదో ముఖ్యమైన విషయం తాను 'మిస్' అయిపోయినాడు. రేగిచెట్టు కింద గుడ్డివాడు గుర్తుకు వచ్చాడు అతనికి–తాను చప్పట్లు కొట్టకపోయినా.

'...జీవితానికి ఒక విలువ వుంది. పరమార్థం వుంది. దీనికోసం బ్రహ్మ సూత్రాలు, భాష్యాలు, కోరికలు తీరుగ వేయవలసిన పనిలేదు. మనం పంచేంద్రియాలను చురుకుగా నిష్పక్షపాతంగా పనిచేయించి పరిశీలించగలిగితే చాలు. జీవితం, వేదాంతం ఒక్కదాన్ని ఒకటి ఒరుసుకుని ప్రవహిస్తూ ముందుకు నడుస్తున్నాయి. మనం వెనక్కు వెడుతున్నామా? ప్రగతి శీలతతో, పరిణామ ప్రక్రియలో ముందుకు పోతున్నామా? అన్న విషయం ఎవరికి వాళ్ళం జాగ్రత్తగా గమనించి చూచుకోవాలి.

'...టాల్‌స్టాయ్ కథ "మనిషికి ఎంత భూమి కావాలి" అన్నది మీకు నేను గుర్తు చేయనక్కర లేదనుకుంటాను. మనిషికి దురాశ ఎందుకు పెరిగిపోతోంది? ఆలోచించండి. డబ్బుకు కటకటలాడిపోతూ పూట గడవక డొక్కలు మాడి కొందరు యేడుస్తుంటే, ఎంత డబ్బు వుందో అది ఎవరిదో వివరంగా తెలియకుండా పూజ గదుల్లో సూట్‌కేసుల్లో మురిగిపోతున్న కరెన్సీ నోట్లు కొందరి కైవసంలో వుండిపోతున్నాయి. సృష్టిలో వున్న సంపదంతా ఈశ్వరుడిది. ఆయన బూడిద పూసుకుని స్మశానంలో రికామీగా తిరుగుతూ వుంటాడని పురాణాలలో సాంకేతికంగా చెప్పిన విషయం మనమెందుకు మరచిపోతున్నాం?––––'

కమలాకరానికి గాంధీగారి 'ట్రస్టీషిప్ ఆఫ్ ప్రాపర్టీ' సిద్ధాంతం గుర్తుకు వచ్చింది. 'స్టేట్ ఓనర్‌షిప్' అన్న కమ్యూనిస్టు మాటలు మనసులో మెదిలాయి. ఆ దేశాలు ఇప్పుడు రాజ్యాంగపరంగా సడలిపోయినా, ఆ 'ఫిలాసఫీ' మటుకు ఇంకా మనిషి మనసుకు, బుద్ధికి పనికి వచ్చేదిగానే మిగిలివుంది.

ఎన్ని రకాలుగా ఎన్ని వాక్యాలుగా విన్నా కమలాకరానికి ఒక్కటే అనిపించింది. ఇవన్నీ నాకూ తెలుసును. కాకపోతే నేను ఉపన్యాసాలు ఇవ్వడం లేదు. ఇతనెవరో నా అభిప్రాయాలన్నీ చక్కగా గుదిగుర్చి సుందరమైన మాలగా తయారుచేసి జనానికి అందించ చూస్తున్నాడు.

మరచిపోయిన విషయాలను మళ్ళీ మళ్ళీ గుర్తుకు తెచ్చి దానితో ఆలోచించవలసింది యింకా చాలా వుంది సుమా...అని మేలుకొలుపులు పాడుతున్నాడు.

అందరూ లేచివెళ్ళి పోవటానికి ఉద్యుక్తులు అవుతూ వున్నా కమలాకరం మటుకు శివశంకరం "యేమండీ...లేవలేక పోతున్నారా! చేయిసాయం ఇవ్వనా?" అని ముందుకు చాచినప్పుడు మటుకే కుర్చీ ఖాళీ చేయగలిగాడు.




ఇంటికి నడుస్తున్నంత సేపూ వాళ్ళ మధ్య నిశ్శబ్దం ఆవరించుకుని వుంది.

చివరకు 'బాగా కదిలించినట్లు వుంది మిమ్మల్ని ఈ ఉపన్యాసం' అన్నాడు శివశంకరం.

'బాగా మాట్లాడాడు అతను. జనంలో మెలుకువ, అవగాహన తీసుకు రావాలని అతని తాపత్రయం. నిజానికి నేను చేస్తున్నపని కూడా అదే. కాని ఎవరికి కావాలి?...ఇలాంటి సంగతులు ఈ రోజుల్లో...?'

'అందరికీ కావాలి. చూడండి. కమలాకరం గారూ జనం కావాలనుకునేది ఒకటి. వాళ్ళకు అవసరం అయినది మరొకటి. కావాలనుకున్నదే ఇస్తున్నట్లుగా కనిపిస్తూ జనానికి నిజంగా అవసరం అయినది ఇవ్వడం ఫిలాసఫర్లు చేసేపని.

కమలాకరానికి ఈ విషయం ఇంతవరకు తనకే ఎందుకు తట్టలేదో అర్థం కాలేదు.

పదే పదే గుచ్చి చెప్పడం వేరు. ఎవరికి వారికి అవగాహన అయ్యేట్లు సూచనగా, హృదయానికి సూటిగా నేరుగా స్పర్శించేట్లు చెప్పడం వేరు...' అంటున్నాడు ఇంకా శివశంకరం.

'అవునవును. అన్ని విషయాలూ నాకే తెలుసును, ఇతరులకు ఏమీ తెలియదు. అన్న ద్వంద్వ నీతిలో ప్రతివాడూ ప్రవర్తిస్తున్నాడు. ఈ భూమికలో పనిచేస్తున్నంత సేపూ మనం ఎవరిలోనూ ఏమీ మార్పులు తీసుకురాలేం' అన్నాడు కమలాకరం. తాను మాట్లాడుతున్నది ఎంతవరకు సరైనదో మనసులో ఇంకా గుణించుకుంటూనే ఇది సరైనదేనని అతనికి ఆక్షణంలో తోస్తోంది. కాని నిజంగా సరైనదేనా?-అయితే ఎందుకు ఆచరణలోనికి రావడం లేదు?...అర్థం కాదు.

అరుంధతి ఇచ్చిన చక్కని 'కాంప్లాన్' తాగేసి బయలుదేరుతూ 'మీరు మీటింగుకు వెళ్ళి యేం 'ఎంజాయ్' చేసారో నాకు తెలీదుగాని, మేం మాత్రం ఈ గంటన్నరా మరింత దగ్గరకు వచ్చాం. పిన్నిగారి దగ్గర నేను రోజూ పాఠాలు నేర్చుకోవాలి' అంది సుబ్బలక్ష్మి.


'పాఠాలు చెప్పడం నాకు చేత కాదమ్మాయ్. ఏదో నాకు తెలిసిన సంగతులు మాత్రం మాయ, మర్మం లేకుండా మాట్లాడుతాను' అంది అరుంధతి.

'అప్పుడప్పుడు ఆఫీసుకు వస్తూ వుండడం మరచిపోకండి-కమలాకరంగారూ. నాకేదయినా ధర్మసందేహాలు వున్నప్పుడు మాత్రం మిమ్మల్ని టెలిఫోన్లోనే ఊదర గొట్టేస్తాను' అన్నాడు శివశంకరం గుమ్మం దాటుతూ.

నిజమా? అన్న సంశయం కమలాకరానికి కలుగకపోలేదుగాని, ఊరికే కుశ్శంకలు పెట్టుకోకుండా ఉన్నదానిని ఉన్నట్లుగా విన్నదానిని విన్నట్లుగా తీసుకోవాలని అప్పటికప్పుడే తీర్మానం చేసుకున్నాడు.

అరుంధతి పాదరసం 'వేపర్‌లాంప్' ఆర్పేస్తూ బెడ్‌లైట్ స్విచ్ ఆన్‌చేసినప్పుడు ఆ నీలి ఊదారంగు మిశ్రమంలో 'నేనప్పుడే పరాయివాడిని అయిపోతున్నాను' అనిపించింది అతనికి.

## నులివెచ్చని పద్యం



ఒక గొప్ప పురావారసత్వం
తాకగానే ఒళ్లు జలదరించే
ఒక ప్రాచీన వాద్యం
చదివే కొలదీ
లోతులకు తీసుకోపోయే మార్మిక పద్యం
మాటలు తీరకుండానే
మౌనంగా జీవన సందేశాన్నిచ్చే
కంప్యూటర్ యుగంలో చూస్తున్న
మూకీ చిత్రం
ఎప్పుడు చదువుకున్నా
మనసుకు ఊరటినిచ్చే
నా తొలినాళ్ళ నులివెచ్చని పద్యం
నిద్రపోతున్న బిడ్డకు
కాళ్ళ దాకా ప్రేమ దుప్పటి కప్పి
అప్యాయంగా తలనిమిరే
తదేకంగా నిలబడి చూసే కళ్లు
నేను మొగ్గలా ముడుచుకున్న
అపరాత్రి వేళ
తన పూల కనులు తెరిచి
గుట్టుగా పరిమళాలు వెదజల్లే
నైట్‌క్వీన్ ప్రేమ

మా మట్టి మద్దుల ఆత్మలకు
ఆకృతుల నిచ్చేందుకు
నిరంతరం తనలో తాను తిరిగే సారె
పాడి పాడి తాన్‌సేన్
రాగంతో దీపాల్ని వెలిగించాడో లేదో
తెలియదు గానీ
రక్తాన్ని మా మట్టి ప్రమిదల్లో కుమ్మరించి
మమ్మల్ని వెలిగించిన ఆత్మదీపం
తను చీకట్లో నిలుచుండి పోయి
మా వెలుగు చదువుల కోసం
జీవితాన్ని మా పుస్తకాల ముందు
యిలాయి బుడ్డిగా పరిచినవాడు
తెల్లనికవిత్వపు నూలు వస్త్రాలు ధరించి
నేను ఠీవిగా నడిచి వెళ్తుంటే
వీధి మొగ వరకూ
వెనక నుండి ముసిముసిగా చూసుకుని
కళాయి వెలసిపోయిన
యవ్వనపు అద్దం ముక్కలో
తన బింబాన్ని తడుముకునే స్వాప్నికుడు
అంచులు విరిగి, బీటలు వారి
బయట పడిన
అపురూప మృణ్మయ పాత్ర
అతని స్పర్శ
రాతి స్తంభంలో దాగిన
సప్తస్వరాలు
బతుకు తవ్వకాలలో
అతని కౌగిలింత
హృదయంలో
కోటి వాక్యాల సింపనీ
ఇవ్వడమే తప్ప
తిరిగి తీసుకోవడం తెలీని
అతడు నా ఆత్మబంధువు
చెప్పడమే కాదు
వినడమూ తెలిసిన
అతడు నా ఆంతరంగిక మిత్రుడు

— శిఖామణి